# మనస్సే బంధమోక్షములకు కారణము

**మనసే హేతువు మనుజుని**
**మనుగడకును బంధమునకు మాన్యతకును నా**
**మనసే ముక్తికి ముఖ్యము**
**మనసే నరకంబు జేర్చు మైమరపించున్.**

**విద్యార్థులారా!**

'మనోమూల మిదం జగత్' జగత్తునుగాని ఇంద్రియములను గాని మనస్సే మలచుచున్నది. మనశ్శక్తివలననే ఇంద్రియములు జగత్తు కదులుచున్నవి. ప్రపంచమంతయు పంచభూతములతోనిండిన స్వరూపము. పృథ్వి, జలము, అగ్ని, వాయువు. ఆకాశము పంచభూతములు. ఇవి ఒకదానికంటె ఒకటి తేలికైన సూక్ష్మమైన స్వరూపాన్ని ధరిస్తున్నవి. పృథ్వికంటె జలము సూక్ష్మమైనది తేలికైనది. నీటికంటె అగ్ని మరింత సూక్ష్మమైనది చాలాతేలికైనది. అగ్నికంటె వాయువు మరింత సూక్ష్మమైనది. వాయువుకంటె ఆకాశము మరింత సూక్ష్మమైనది. ఏతావాతా పృథ్వి, జలము, అగ్ని, వాయువు అన్నీకూడను ఆకాశమునుండి ఆవిర్భవించినవే.

ఆకాశముయొక్క చలనముచేతనే వాయువు ఏర్పడుచున్నది. వాయువు చేతనే అగ్ని సంభవిస్తుంది. వాయువే లేకుండిన అగ్ని అభివృద్ధి చెందదు. అగ్నియొక్క చల్లదనమువల్లనే నీరు ఆవిర్భవిస్తున్నది. జలము ఘనీభూతము కావటంచేతనే పృథ్విగా మారుతుంది. ఇవన్నీ దైవత్వమునుంచి ఆవిర్భవించిన భూతములే. ఈ అన్నింటికిని మనసే మూలకారణము. శరీరము లోపల పంచకోశముల మధ్యలో నిల్చినట్టిది ఈ మనస్సు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయములు పంచకోశములు. ఈ పంచకోశములయందు మనస్సు ఎక్కడ ఉంది? మనస్సుకు పైన ప్రాణము, క్రింద బుద్ధి ఉన్నవి. ప్రాణము, బుద్ధి రెండు అగ్నితత్త్వములు. మనస్సు జలతత్త్వము. మనస్సుకు అధిష్ఠాన దేవత చంద్రుడు. కనుకనే చల్లదనము మనసుయొక్క స్వభావము. అయితే దీనికిపైన ప్రాణమనే అగ్ని క్రింద బుద్ధి అనే

srisathyasaivachanamrutam

అగ్ని ఉండటం చేతనే మనసు జలముగా మారిపోతుండాది. పల్లమునకు ప్రవహించటమే జలము స్వభావము. ఉన్నత స్థాయికి పోయే స్వభావము దానికిలేదు. కనుక మనస్సు నిరంతరము విషయ సంబంధమైన మార్గమునందే ప్రయాణము సలుపుతుంది. ప్రాకృతమైన మార్గమునే అనుసరిస్తూ ఉంటుంది. పవిత్రమైన, ఉత్తమమైన, ఊర్ధ్వస్థాయికి ఇది ప్రయాణము చేయలేదు. మనస్సుయొక్క తత్త్వము ఊర్ధ్వమార్గములో ప్రవేశపెట్టవలెనన్న దీనికి ఆధ్యాత్మిక చిత్తము అత్యవసరము.

**అంతర్వాణి**

ప్రతి మానవుడు ఆనందాన్నే ఆశిస్తున్నాడు, అభిలషిస్తున్నాడు. అయితే ఈ ఆనందము ఏరీతిగా మనకు ప్రాప్తికాగలదు? పంచభూతములకు నిలయమైన ఆత్మతత్త్వమును మనంకొంచెం అర్థం చేసుకోవాలి. పంచభూతములకు అవకాశము నందించునదే ఆకాశము. ఇది ఆత్మతత్త్వమునుండి ఆవిర్భవించినట్టిది. ఆత్మ తత్త్వాన్ని మనం చక్కగా అర్థం చేసుకున్నప్పుడు పంచభూతములుగాని, పంచకోశములుగాని మన స్వాధీనములో ఉండగలవు. అప్పుడే మనకు ఆనందప్రాప్తి చేకూరగలదు. ఆనందమనేది సుఖమునకు, దుఃఖమునకు అతీతమైనది. మానవునకు సుఖము దుఃఖము మనస్సు యొక్క వికారములే. ఈ సుఖదుఃఖములకు అతీతమైన స్థితియే ఆనందము. అట్టి ఆనంద స్థితియే ప్రజ్ఞాతత్త్వము. ఈ ప్రజ్ఞ సర్వత్ర వ్యాపించినటువంటిది. ఇదే ప్రజ్ఞానం బ్రహ్మ అన్నారు. ఈ ప్రజ్ఞానము సర్వత్ర వ్యాపించినదైనప్పటికిని దానిని గుర్తించటానికి కొన్ని మార్గములను మనము అనుసరించవలెను. దేహమునందును, మనసు నందును, బుద్ధియందును, అంతఃకరణమునందును ఉండిన సమతత్త్వం కనుకనే దీనికి ప్రజ్ఞ అని చక్కని పేరు. దీనినే అంతర్వాణి అని చెప్తూ వచ్చారు. అంతర్వాణికి, భగవంతునికి భేదంలేదు. అంతర్వాణియే భగవంతుడు. భగవంతుడే అంతర్వాణి. ఆ యొక్క అంతర్వాణిని మనము అనుసరించినప్పుడు మనకానందము ప్రాప్తిస్తుంది.

అయితే ఈ అంతర్వాణిని మనము ఏరీతిగా అనుసరించాలి. అంతర్వాణిని అనుభవించవలెనన్న బహిర్ముఖమైన ఇంద్రియముల శక్తిని మనం అణచుకోవాలి. అంతర్బహిరింద్రియములను అణగద్రొక్కినప్పుడే ఈ అంతర్వాణి మనకు సుస్పష్టంగా

sri sathyasaivachanamrutam

వినిపించగలదు. బహిర్ముఖమైన దీనికి మనస్సనీ, అంతర్ముఖమైన దీనికే నమ అని పేరు పెట్టారు. నమ అనగా మనసు కానిది. మనస్సుయొక్క ప్రభావం ఉండినంతవరకు మనిషి అనేక రకములైన మార్గములనుసరిస్తూ ఉంటాడు. ఈ మనస్తత్వాన్ని అణగద్రొక్కినప్పుడే అమనస్కమనే స్వరూపాన్ని ధరిస్తాడు. అమనస్క స్థితియందు మాత్రమే ఈ అంతర్వాణి మనకు ప్రాప్తిస్తుంది. ఈ అంతర్వాణి నిమిత్తమై మనము అనేక విధములైన సాధనలు చేయవలసి వస్తుంది. దీనికే భక్తి ప్రపత్తులని పేరు.

భక్తి ప్రపత్తుల తత్త్వం మనం అర్థం చేసుకోవలెనన్న భగవంతుని ప్రేమ అత్యవసరము. భగవంతుని ప్రేమను మనం పొందవలెనన్న సాకారమనేది సరియైన మార్గం. సాకార భక్తియందు అనేక రకములైన మార్గములుంటున్నవి. ఇందులో ప్రధానమైనవి మూడు. తామసికము, రాజసికము, సాత్వికము. తామసికములో హింస చేతను, క్రోధముచేతను, ఆడంబరము చేతను మానవుడు దైవాన్ని ఆరాధిస్తూ ఉంటాడు. ఆడంబరము చేత అహంకారముచేత, కీర్తి ప్రతిష్ఠల నిమిత్తమై ఆచరించేది తామసిక భక్తిగా మారుతుంది. ఇంక రాజసిక భక్తి. పేరు ప్రతిష్ఠల నిమిత్తమై అధికారం నిమిత్తమై స్వ విషయంలోపల సరియైన స్థితిని పొందాలనే నిమిత్తమై భగవంతుని ప్రార్థిస్తూ ఉంటాడు. సాత్వికమైన భక్తుడు శరణాగతి తత్త్వమందు సర్వత్ర భగవంతుడు ఒక్కడే ఉన్నాడనే విశ్వాసం చేత సర్వకర్మలు కూడను భగవత్ప్రీత్యర్థమై శ్రమించి ఏది చేసినా భగవత్సేవగా విశ్వసిస్తూ చేస్తుంటాడు.

మరికొన్ని రకములైన భక్తులుంటున్నాయి. నిర్గుణ భక్తి, రాక్షస భక్తి, అసుర భక్తి, మోహభక్తి అని. తానొక్కడు మాత్రమే ధన్యుడు కావాలి. తాను మాత్రమే ఆనందించాలి. తాను మాత్రమే క్షేమంగా ఉండాలి అనే పరిపూర్ణ స్వార్థముతో నిండినది అసురభక్తి. తన సహచరులు, తన కుటుంబము, తన తోటి మానవుల క్షేమము ఏమాత్రము ఆశించడు. రాక్షస భక్తి గలవాడు హింసాదుల చేతను, క్రోధము చేతను, దయాదాక్షిణ్య రహిత జీవితము గడుపుతూ ఉంటాడు. మోహ భక్తి అనగా నిత్యానిత్య విషయ పరిశీలనా రహితుడై, విచారణా శక్తి శూన్యుడై, ఒకరిని బాధించాలనే భావము లేకపోయినప్పటికిని ఇతరులకు బాధలు కలిగిస్తుంటారు. అలాంటి తత్త్వములో అర్థము చేసుకునే శక్తి సామర్థ్యములు కోల్పోతాడు. ఈ ముప్పురికి దైవభక్తి

srisathyasaivachanamrutam

ఏమాత్రము ఉండదు. దైవచింతన అనేది యేమాత్రము ఉండదు. పరోపకార తత్త్వము అసలే ఉండదు. దయాదాక్షిణ్య రహితులై ఉంటారు. ఇలాంటిది నిర్గుణభక్తి అని దీన్ని ప్రబోధిస్తూ ఉంటారు. ఇది కేవలము ఒక విధమైన రాక్షస భక్తి అనే చెప్పవచ్చు.

ఈ రెండింటికిని విరుద్ధమైన భక్తులు రెండున్నాయి. విప్రక భక్తి అని ఒకటి సంకర్షక భక్తి అని మరొొకటి. సంకర్షక భక్తి అనగా కొన్ని వస్తువులను దూరముగా నున్న వాటిని సమీపింప చేసుకోవటం. దూరముగా ఉన్న వ్యక్తులను సన్నిహితముగావించుకోవటం. దూరముగా ఉండిన విషయములను తనకు చెందినట్టుగా భావించుకోవటం. ఇది ప్రేమ తత్త్వమునకు సంబంధించినది. దూరముగా ఉండిన వస్తువులను, వ్యక్తులను, విషయములను తనకు సన్నిహితముగా గావించుకోవటమే యీ సంకర్షణశక్తి. ఇది ఆకర్షణీయముగా ఉండేటువంటిది. రెండవది విప్రక భక్తి. ఇది ద్వేషముతో కూడినది. ఒక వస్తువును దగ్గరనున్న దానిని దూరం చేసుకోటం. దగ్గరున్న వ్యక్తులను దూరం చేసుకోవటం. దగ్గరున్న విషయాలను చాలా దూరంగా భావించుకోవటం. ఇది కేవలం ఒక ద్వేష భక్తి అని చెప్పవచ్చు. సంకర్షణ భక్తిలో మూడు రకములుంటున్నాయి. తనకంటె అధికులను చూసి గౌరవించటం, వారికి స్వాగతం చెప్పటం, వారికి వినయ విధేయతలు ప్రకటించటము, నమ్రతతో వారియొక్క సంగతి అనుభవించటము. ఇది మొదటి తరగతికి చెందినది. తనకు ఈడైనవారితో స్నేహముగావించి వారితో ప్రేమను పెంచుకోవటం, వారితో భయమును వీడి ఉండటము రెండవది. ఇంక మూడవది తన కంటె చిన్న వారిని చూసి దయ, జాలిని చూపి వారికి తగిన మార్గమును ప్రబోధించటము. ఈ అన్నింటికిని అత్యంతమైన ప్రేమ మరొొకటి ఉన్నది.

**దైవబలమే శాంతినిస్తుంది**

లోకములో ధర్మార్థకామమోక్షములని చతుర్విధములైన పురుషార్థములు ఉంటున్నాయి. పరమ పురుషార్థమైనది మరొొకటి ఉన్నదనే సత్యాన్ని గుర్తించుకోలేక పోతున్నారు. అన్నింటికంటె అధికుడైనవాడు దైవము. అలాంటి దైవాన్ని పొందినప్పుడు అలాంటి దైవాన్ని దర్శించినప్పుడు, అలాంటి దైవముయొక్క సన్నిహిత సంబంధ బాంధవ్యమును ఏర్పరచుకున్నప్పుడు కలిగే ఆనందము, సాయుజ్యము, ఆప్రేమ తత్త్వమునే పరాభక్తి అని చెప్తూ వచ్చారు. ఏతావాతా

srisathyasaivachanamrutam

పరాభక్తి అనగా సాయుజ్యమనే చెప్పవచ్చు. సాయుజ్యమనేది లీనముకావటమే. భిన్నత్వము లేకుండా, ఏకత్వములో అనేకత్వము కల్పించుకోక, అనేకత్వములోని ఏకత్వాన్ని అనుభవించటమే సాయుజ్యము. ఇలాంటి తత్త్వమును పొందేదే పరాభక్తి. ఈ పరాభక్తి తత్త్వమనేది అందరికి ప్రాప్తించేదికాదు. ఇది లభ్యము కాదని మనము నిరుత్సాహమునకో, నిరాశకో, నిస్పృహకో యేమాత్రము తావివ్వనక్కరలేదు. దానికి తగిన కృషిని చెయ్యాలి. ఎంతకాలమైనా నీవు వేరు, నేను వేరు అనే భేదాభిప్రాయాలందే జీవితము వ్యర్థము గావించరాదు. ఈ భేదభావము ఉండినంతవరకు అనుమానం కలుగుతూ ఉంటుంది. ఈ అనుమానాస్పదములు ఉండినంతవరకు వాడు నిజమైన సత్యాన్ని గుర్తించుకోలేడు. ఈనాటి మానవుడు ఎన్నో బోధిస్తూ ఉన్నాడు కాని బోధించిన విషయములు తనకు అన్వయిస్తాయనే సత్యాన్ని మరచిపోతున్నాడు. ఇతరులకు బోధించే విషయము తాను ఎంతవరకు ఆచరిస్తున్నాననే విచారాన్ని చేయటంలేదు. ఇదికేవలం ఒక ఆడంబరమైన భక్తి. ఈ ఆడంబరం, అహంకారం, అధఃపతనము కావిస్తుంది. భగవంతుని కూడ దూరము గావించుకుంటాడు. దివ్యభావములను దూరము గావించుకునే అనుమానములకు మనం ఏమాత్రము అవకాశం ఇవ్వకూడదు. స్వార్థము, స్వప్రయోజనము దృష్టియందుంచుకున్న వానికే ఈ అనుమానములు అధికంగా ఉంటాయి. భగవత్ప్రీతిని, ప్రపత్తిని అనుభవించి ఆశించేవానికి ఈ విధమైన భేదములు ఏమాత్రము ఉండవు. లోక సంబంధమైన వ్యవహారములందు మాత్రమే తన భక్తి ప్రపత్తులను వెల్లడి చేసుకొంటున్నాడు. కాని దైవత్వ సంబంధమైన ఆత్మ తత్త్వమునందు తన భక్తి ప్రపత్తులు తమకు తామే సాక్షిగా ఉంటుండాయి.

విద్యార్థులారా! ప్రాకృతమైన ఈ జీవితమునందు ఈ జగత్సంబంధమైన వ్యవహారము ఎంతకాలము? ఈ జగత్సంబంధమైన వ్యవహారము ఏవిధమైన శాంతి సంతోషములనందిస్తున్నాయి? తద్వారా మానవుడు అనేక విధాల అశాంతిని పొందుతున్నాడు. అర్థబలము, ధనబలము, అంగబలము భక్తి ముక్తుల సాధింప పనికిరావు. అటులె విద్యాబలము కూడ. దైవబలమొక్కటె మనుజుని ధన్యుజేయు. జగత్తులో ఎన్ని బలములుండినప్పటికి అన్ని బలములు దుర్బలములే. ధనబలము మాత్రమే బలమనుకుంటున్నారు జగత్తులో. కాదు. దైవబలము ఒక్కటియే ప్రధానమైన బలము. శంకరులు కూడా చెప్పారు.

srisathyasaivachanamrutam

**మాకురు ధనజనయౌవన గర్వం**
**హరతి నిమేషాత్ కాలః సర్వం**

ధన జన యౌవన గర్వం క్షణమాత్రము మినుకు మినుకుమనునట్లుగా ఉంటుంటాది. ధనము జడమైనది. ఈ జడమైన దానికి ఎక్కడ ఉంది బలము? మనిషియందున్న మనస్తత్వము వల్లనే దీనికి బలము కాని దుర్బలము కాని ఏర్పడుతుండాది. ధనము కాని, విద్యకాని ఇంకేవిధమైన సంపత్తులు గాని అన్నీ కూడను పరిశుద్ధమైన జలము వంటిది. ఈ జలము ఏ రంగు బాటిల్‌లో చేరినప్పుడు ఆ రంగు స్వరూపాన్ని పొందుతుంటాది. అదే విధముగనే ధనము ఒక దుర్మార్గునిలో చేరినప్పుడు ఆ ధనము కూడను దుర్వినియోగంగానే పోతుంటాది. ఆ ధనము పవిత్రమైన హృదయము కలవారిలో చేరినప్పుడు అది పవిత్రమైనదిగానే రూపొందుతుంది. సత్కార్యములకు ప్రయత్నిస్తుంది. కాబట్టి ధనము గాని, విద్యగాని, ఇంకేవిధమైన శక్తి సామర్థ్యములుగాని మనిషి స్వభావాన్ని బట్టే ఆ స్వరూపాన్ని చెందిపోతున్నాయి. ధనము చెడ్డదికాదు. వినియోగ విధానములు చెడ్డవిగా, మంచివిగా మారుతున్నాయి. అందరు ధనవంతులకును అహంకారము ఉండదు. విద్యావంతులందరికి అహంకారము ఉండదు. వాని స్వరూప స్వభావములు పురస్కరించుకొని మనసుయొక్క ప్రభావం సంబంధం చేసుకొని వారియొక్క మంచిచెడ్డలు మారుతున్నాయి. కనుకనే మనసు యొక్క ప్రభావాన్ని మంచి మార్గములో ప్రవేశపెట్టటానికి ఆధ్యాత్మిక మార్గమే సరియైనటువంటిది.

**భగవదాజ్ఞను శిరసావహించండి**

ఆధ్యాత్మిక మార్గములో అనేకవిధములైన అడ్డులు తగులుతుంటాయి. మొట్టమొదటి అడ్డు వాసనలు. వాసనలనగా అభిమానమమకారములు. ఎలాంటి అభిమానమమకారములు? ప్రాకృత సంబంధమైన అనుకూలములు, ఆనందములు ఇలాంటివంతా కూడను సత్యముగా భావిస్తుంటాడు. భగవదాజ్ఞను శిరసావహించి ఆ యొక్క కార్యములందు దీక్షను బూని విజయమును సాధించవలెనని ఆశించే వ్యక్తులకు ఇది మొట్టమొదట అడ్డు తగులుతుంటాది. నా బంధువులేమనుకుంటారో, నామిత్రులు ఏవిధంగా భావిస్తారో, సమాజములో నాకు ఏవిధమైన పేరు ప్రతిష్ఠలకు భంగమౌతుందో అని సంకుచిత హృదయులై

sri sathyasai vachanamrutam

ఆడంబరము నిమిత్తమై, గౌరవమర్యాదలు నిమిత్తమై, తాత్కాలిక సుఖశాంతుల నిమిత్తమై భంగపడి దైవాజ్ఞను ఉల్లంఘిస్తూ ఉంటారు. రెండవది అసూయాభావము అడ్డు తగులుతుంది. అసూయాభావం ఎవరిపైన వస్తుంది? తనకంటె అధికులైన వారిని చూసి అధిక విద్యావంతులో, అధిక శ్రీమంతులో, అధిక బలవంతులో ఇలా అధికమైన వారిని చూసి అసూయా భావం ఉట్టిపడుతుంది. సాధకుడు అసూయా భావము లేకుండా చూసుకోవాలి. మూడవది అహంకారభావము. అహంకారి తనలో ఉన్న ఎన్ని దోషములైనా మంచివిగా భావిస్తాడు. పరులయందున్న మంచిని దోషముగా నిరూపిస్తాడు. తాను చేసే దోషములనంతా సమర్థించటానికి ప్రయత్నిస్తాడు. సమాజమందుగాని, మరే విధములైన పార్టీలయందుగాని తనకు పేరు ప్రతిష్ఠలు రావాలి. దాని నిమిత్తమై దైవాజ్ఞనుకూడను ఉల్లంఘిస్తూ ఉంటాడు. అట్టివారు సరైన భక్తులు కారు. ఈ భక్తికి సన్నిహిత సంబంధ బాంధవ్యము ఉండదు.

దీనికి చక్కని ఉదాహరణము హనుమంతుడే. రామాజ్ఞను శిరసావహించి, సీతాన్వేషణ గావించి, విజయాన్ని సాధించాలని సంకల్పించుకున్నాడు. రామాజ్ఞను తీసుకొని వానర సైన్యముతో సీతాన్వేషణలో ప్రవేశించాడు. అక్కడ సముద్రం ఒడ్డు చేరాడు. అగాధమైన సముద్రమును చూపేటప్పటికి వానరుల గుండెలు జారిపోయాయి. దీన్ని ఏరీతిగా దాటటం? ఆ లంకలో ఏవిధంగా ప్రవేశించటం? ఇది అసాధ్యము అసాధ్యమని అందరు బలహీనులయ్యారు. కాని ఒక్క హనుమంతుడు మాత్రమే ధీరుడై భగవదాజ్ఞను శిరసావహించి నెరవేర్చుకోవటం మన కర్తవ్యము. ఇది కష్టముకాని నష్టముగాని, నిష్ఠూరముగాని, నిందలుగాని, ప్రాణమైనా పోనీ కాని దీనిని నెరవేర్చటం మనకర్తవ్యము. నేను దీంట్లో ప్రవేశిస్తాను. అయితే భగవంతుని కార్య విజయమును అందరు సాధించినవారుగా ఉండాలిగాని నేనొక్కడనే సాధించాననే అహంకారము నాకు రాకూడదు. కనుక నేను సముద్రము దాటి లంక నుంచి వెనుకకు వచ్చేంతవరకు మీరు కిష్కింధకు రాముని దగ్గరకు పోకూడదు. ఇక్కడే నా నిమిత్తమై కాచుకొని ఉండాలన్నాడు.

ఆవిధంగా వారిని శాసించి మొదట పర్వతాన్ని ఎక్కాడు. ఏమిటా పర్వతము? నేను రామాజ్ఞలోపల ప్రాణమైనా అర్పితము గావించి అతనియొక్క ఆజ్ఞను శిరసావహించాలి. ఇదియే

srisathyasaivachanamrutam

నాదీక్ష అని హృదయ పూర్వకముగా ప్రమాణము చేసుకున్నాడు. రెండవ పర్వతము ఎక్కాడు. వాక్కుతో కింద ఉన్న వానరులకు శాసనం చేశాడు. నా జీవితం రామాజ్ఞలోపల అంకితం చేస్తున్నాను. దేనినైనా సాధించగలను. త్వరలో విజయాన్ని తీసుకొని వస్తాను. మరి మూడో పర్వతమెక్కాడు. ఇదుగో నేనిప్పుడు సముద్రాన్ని దాటుతున్నానని కుప్పించి ఎగసాడు. భగవంతుని ఆజ్ఞను శిరసావహించటానికి త్రికరణ శుద్ధి అనగా మనస్సు యొక్క శుద్ధి మొదటిది, రెండవ శుద్ధి వాక్కుది. మూడవశుద్ధి శరీరానిది. ఈ మూడింటియందు త్రికరణ శుద్ధిగా సముద్రముపైన తానెగిరాడు. త్రికరణ శుద్ధి అనగా మనస్సులో దీక్షను పూనటం, వాక్కులో దానిని వెల్లడించటం, శరీరముతో అనుభవించటము. కొంతదూరము పోయేటప్పటికి వాసనా స్వరూపమైన మైనాకం వచ్చింది. వాయుదేవుని వల్ల రక్షింపబడినది మైనాకము కనుక వాయుదేవుని పుత్రుడైన ఈ హనుమంతునకు కృతజ్ఞత నందించాలని మంచి ఉద్దేశ్యముతోనే వచ్చింది పాపం. ఓమారుతీ! నాపైన కొంతసేపు విశ్రాంతి తీసుకొని నా ఆతిథ్యము పుచ్చుకొని వెళ్ళమని కోరింది. హనుమంతుడు చెప్పాడు. నేను విందు లారగించే నిమిత్తము రాలేదు. రామాజ్ఞను నేను పూర్తిచేసే వరకు నీరైనా త్రాగను. భగవంతుని ఆజ్ఞనే నాకు ప్రధానము. అతని సేవలో నేనింక అంకితమైపోయాను. కనుక రామాజ్ఞను పూర్తి నెరవేర్చుకొని వచ్చేంత వరకును నీయొక్క ఆతిథ్యము నాకక్కరలేదన్నాడు. అనగా రాగమును ఉల్లంఘించాడు. సౌఖ్యమును తోసివేశాడు. మరికొంత దూరం వెళ్ళేటప్పటికి సురస వచ్చింది. సురస అనగా అసూయా రాక్షసి. హనుమంతుడు ఎగిరిపోతుంటే ఆనీడను పట్టి లాగిందన్నమాట. తనకంటె అధికులైన వారిని క్రిందికి లాగటమే దాని స్వభావము.

హనుమంతుడు నాలుగు ప్రక్కల చూశాడు. ఎక్కడ ఎవరు కనుపించలేదు. కిందచూశాడు. ఇదొక రాక్షస కృత్యము. అసూయతో నన్ను క్రిందికి లాగటానికి చూస్తుందని గుర్తించాడు. ఆ మరుక్షణంలోనే సురస ఓ హనుమంతా! నీవు నాకు ఆహారంగా మారిపోవాలంది. హనుమంతుడు చెప్పాడు. నీకు ఆహారం కావటంలో నేను ఏమాత్రము సందేహించను. అయితే ఒక్కటి నా ప్రతిజ్ఞ ఉంటుండాది. భగవంతుని ఆజ్ఞ పూర్తి నెరవేర్చిన తరువాత ఎవరికైనా సరే నేను ఆహారంగా ఉంటాను. రామాజ్ఞను తీసుకొనిపోయి సీతకందించి సీతయొక్క విషయము తిరిగి రామునకప్పజెప్పి నేను తిరిగి నీకు ఆహారంగా వస్తానన్నాడు. ఒరే పిచ్చివాడా! ఆకలి

srisathyasaivahini.org

నాకిప్పుడౌతుంటే ఎప్పుడో నీవు ఆహారంగా వస్తానంటే నాకక్కరలేదు. ఇప్పుడే నీవు నాకు ఆహారంగా సిద్ధంకా అన్నది. ఇది అసాధ్యము. భగవంతుని ఆజ్ఞనే నాకు ప్రధానము నీవేమైనా చేసుకో నీవెన్ని హింసలు పెట్టినా ప్రాణమైనా వదులుతానుగాని భగవదాజ్ఞను విడువను అన్నాడు. సురస అనేక రకములైన రూపములు దాల్చి హనుమంతుని మ్రింగటానికి ప్రయత్నించింది. కానీ భగవదాజ్ఞను లక్ష్యము నందుంచుకున్న హనుమంతుడు ఎట్టి భయభ్రాంతులు లేక ఆమెను హతమార్చాడు. అనగా అసూయ అనేగుణము ప్రాణం తీశాడు.

అక్కడనుంచి లంకలో ప్రవేశించాడు. చూశాడు. అతి సుందరమైన లంకను చూసి ఆహా! రావణుని నేను ఎప్పుడూ చూడలేదు. ఇతని భవనములే ఇంత సుందరముగా ఉంటున్నప్పుడు వీరి భావాలు ఎంత పవిత్రంగా ఉంటాయో అనుకున్నాడు. తక్షణమే రామాజ్ఞ జ్ఞాపకం వచ్చింది. వీడే నిజంగా పవిత్రుడైతే ఈ అపవిత్రమైన కార్యములెందుకు చేస్తాడు? వీని మంచి చెడ్డలు గుర్తించాలని అతి స్వల్ప స్వరూపాన్ని ధరించి లంకలో ప్రవేశించటానికి పోయాడు. అక్కడ అహంకారియైన లంఖిణి ఉంటున్నది. చూచింది. ఒరే కోతీ! నన్ను కూడ మోసం చేసి దొంగతనంగా లోపల ప్రవేశిస్తున్నావా? అని అరచింది. హనుమంతుడు మండిపోయాడు. నేను దొంగనా! నేను దొంగనా ఈ లంకలో ప్రవేశిస్తున్నానా? మీ రాజు మహా దొంగవాడు. ఆ రాజుకు తగిన రాక్షసులే మీరందరు 'యథారాజా తథా ప్రజా' మాప్రభువు ధర్మస్వరూపుడు. సత్యవాక్పరిపాలకుడు. మా ప్రభువు యొక్క శిష్యులైన మేము కూడను ధర్మస్వరూపులమే. మాలో ఇలాంటి దుర్గుణములు ప్రవేశించటానికి అవకాశం లేదు' అని గర్జించాడు. అప్పుడు రాక్షసి మా మహారాజును దొంగ అంటున్నావా అని కోపగించింది. దొంగకాకపోతే ఆ శ్రీరామచంద్రుని పత్ని సీతను ఎట్లా తెచ్చాడు. వాడు దొంగకాక మరెవ్వడన్నాడు. ఈవిధంగా పోరాడి మొట్టమొదట వాసనను, రెండవది అసూయ, మూడవది అహంకారము రూపుమాపాడు.

**శాంతమే భక్తుని లక్షణం**

ఇవి భక్తుని ప్రధానమైన గుర్తులని లోకానికి చాటుతూ వచ్చాడు. నిజంగా భక్తులైన వారు ఈ వాసనలకోసం ఏమాత్రం ప్రాకులాడకూడదు. ఆడంబరము, అసూయ ఇందులో

sri sathyasai vahini amrutam

ఏమాత్రము ఉండకూడదు. అహంకారమునకు అసలే తావు ఇవ్వకూడదు. కనుక భక్తుడైనవాడు వాసనలను, అసూయను, అహంకారమును అణగద్రొక్కాలి. సీతను చూసిన తరువాత ఆమె భక్తి ప్రపత్తులు చక్కగా గుర్తిస్తూ వచ్చాడు. భక్తునికి ఉండవలసిన లక్షణాలు తెలుసుకోటానికి ప్రయత్నించాడు. నిరంతరము భగవంతుని చింతనలో ఉండినవాడు శరీరాన్ని శుష్కింప చేసుకుంటాడు. దేహాన్ని పెంచుకున్న వానికి భక్తి అభివృద్ధికాదు. భక్తి పెరిగిన వానికి దేహమభివృద్ధి కాదు. ఈ రెండింటికి చాలా భిన్నంగా ఉంటుంటాది. సీతను చూశాడు. ఆమె శరీరం చాలా శుష్కించిపోయింది. ఇది పతి భక్తికి ప్రధాన చిహ్నమనుకున్నాడు. దుఃఖములో ఉండినవాడు విందులు ఆరగించడు. కయ్యానికి కాలు దువ్వడు. కనుకనే ఆ సీతామాత ఈ దుఃఖములో ఉండటం చేత తన దేహ సంబంధమైన భ్రాంతిని వదలిపెట్టింది. దైవము కావాలనేవానికి దేహచింత ఉండకూడదు. దేహసుఖములు, సంతోషములు, సౌభాగ్యములు ఏమాత్రము ఆశించరాదు. ఈ పదినెలలు ఆమె అట్లా ఉండటం చేత తల అంతా ఒక అట్టగా చేరిపోయింది. ఏ ఒక్క సంస్కారము ఆమె ఆశించలేదు. రామచింత తప్ప అన్యచింతలు ఆమెలో లేవు. ఇంక రెండవది ఏమిటంటే దృష్టి. ఆమె దృష్టి తన పాదములపైన తప్ప అన్యుల ముఖము చేసేది కాదు. తలక్రిందికి వంచుకొని తన పాదములు మాత్రమే చూస్తుండాది. బయట ఎవరు వస్తున్నారో ఎవరు పోతున్నారో ఒకరి ముఖమైనా తాను చూడలేదు. ఇది భక్తులకు రెండవ గుర్తు అనుకున్నాడు. మూడవది తన మనస్సు భగవంతుని పాదారవిందములపైన పెట్టటం. మనస్సును భగవంతునిపైన, దృష్టిని తనపాదములపైన పెట్టి దేహభ్రాంతి లేకుండా నిరంతరము భగవంతుని చింత చేయటమే భక్తుని ప్రధానమైన గుర్తులని గుర్తించాడు. ఈ విధంగా సీతతో పరిచయం జరిగిన తరువాత తల్లీ నేనొక ప్రతిజ్ఞ తీసుకున్నాను. మీదర్శన మయ్యేంత వరకు ఆహారపానీయములు ముట్టకూడదనుకున్నాను. నీ దర్శనమైంది. కనుక తమరు ఆజ్ఞ యిస్తే ఈ అశోకవనములో పండ్లు కనుపిస్తున్నాయి. వాటిని భుజించి నా ఆకలి తీర్చుకుంటానన్నాడు. అక్కడ కూడను ఆమె పవిత్రమైన ధర్మాన్ని నిరూపిస్తూ వచ్చింది. హనుమంతా! ఇది నాది నీది కాదు. ఇది రావణుని వనము. వారి ఆజ్ఞ లేకుండా భుజించటము దొంగతనము. కిందపడిన పండ్లు కావలసిఉంటే నీవు భుజించు అని చెప్పింది.

కానీ హనుమంతుడు ఆకలిని తట్టుకోలేక చెట్టుఎక్కాడు. అన్ని పండ్లు కోసి తిన్నాడు.



sri sathyasai vacharamrutam

తినటమే కాకుండా కొమ్మలు విరిచివేయటము చెట్లంతా లాగివేయటము ఈ కోతి చేష్టలు చేసుకుంటూపోయాడు. ఇది కావాలనే చేస్తూ వచ్చాడు. ఎందుకంటే ఈ విధమైన పనులు చేసినప్పుడే నేను రావణుని సన్నిధికి పోవటానికి వీలౌతుంది. అప్పుడు వానికి సరియైన బుద్ధి చెప్పటానికి సాధ్యమవుతుంది. ఈ విధంగా చెట్లంతా పెరికిపారవేయటము వేర్లవరకు లాగివేయటము ఈవిధమైన చర్యలు చేస్తూవచ్చాడు. ఈ వార్తలంకలో ప్రాకిపోయింది. రావణునికి తెలిసిపోయింది. వీరులనంతా పిలుస్తూ వచ్చారు. హనుమంతుడు వారితో పోరాడి వారి ప్రాణములు తీశాడు. రావణుడు మరింత ఉగ్రుడయ్యాడు. తన కుమారులను పంపించాడు. హనుమంతుడు కొంతవరకు లొంగినట్లు నటన చేశాడు. ఇంద్రజిత్తు అనేక మోసములతో కూడినవాడు. అతని బలమునకు అసాధ్యము కావటం చేత బ్రహ్మాస్త్రాన్ని కూడా వేశాడు. దానితో హనుమంతుడు లొంగిపోయాడు. హనుమంతుని తీసుకొనిపోయి రావణుని ముందు నిలిపాడు. అక్కడ కూడా హనుమంతుడు ఏమాత్రం తగ్గలేదు. రాముని దగ్గర మాత్రమే తాను దాసుడుగాని రావణుని దగ్గర మహా వీరునిగా నిలిచాడు. రాముని దగ్గర నేను దీనుడను. రావణుని దగ్గర మహావీరుడను అన్నాడు. నీవెక్కడ నుంచి వచ్చావు? అని రావణుడు అడిగాడు. నేను నాప్రభువైన రామాజ్ఞను నడచుకునే నిమిత్తమై ఈలంకలో ప్రవేశించానన్నాడు. వచ్చావు కాని ఫలములంతా ఎందుకు తిన్నావన్నాడు. ఆకలి వేసింది తిన్నానన్నాడు. ఆ పువ్వులు అంతా ఎందుకు పీకిపారవేశావు అన్నాడు. ఆ పువ్వులు నీవినావి కావు. నా ప్రభువు సృష్టించినవి. నీకెంత అధికారము ఉందో నాకంత అధికారము ఉందన్నాడు. అయితే ఈ చెట్లనంతా ఎందుకు పెరికి పారవేశావన్నాడు. ఇది నాకు సహజము అన్నాడు. అయితే మా రాక్షసులందరినీ ఎందుకు చంపివేశావన్నాడు. వారునన్ను చంపటానికి వచ్చారు. నన్ను నేను రక్షించుకోటానికి వారిని చంపానన్నాడు. ఒక్కొక్క దానికి ఈవిధమైన సమాధానములు ఇస్తూ వచ్చాడు హనుమంతుడు. ఏ ఒక్క పదమునందు అసత్యముగాని ఇంకే విధమైన మోసముగాని లేదు. రామాజ్ఞను శిరసావహించి సత్యవాక్య పరిపాలన చేసస్తూ వచ్చాడు. నా ప్రభువు శ్రీరామచంద్రమూర్తి. నేను అతని దాసుడను. అతని ఆజ్ఞనే నాకు ప్రధానమైనది అని ఈవిధంగా భక్తి ప్రపత్తులు లోకానికి చాటినవాడు హనుమంతుడు.

**త్రికరణ శుద్ధి**

ఈనాడు ప్రభువు ఎలాంటివాడో దాసులు అలాంటివారుగా తయారు కావాలి. సాయి భక్తులమని చెప్పుకోవటము దానికి విరుద్ధమైన మార్గమును అనుసరించటం. అసత్య మార్గమును ప్రవేశించిన వారమౌతాము. సాయి ఆశయాలకు తగినట్లుగా మనము నడచుకోవాలి. ఆదర్శవంతమైన జీవితాన్ని మనము అందించాలి. ఆజ్ఞను శిరసావహించాలి. ఎన్ని కష్టములైనా ఎన్ని దుఃఖములైనా వచ్చినప్పటికిని ఆజ్ఞను నెరవేర్చుకోవటమే మన కర్తవ్యముగా భావించాలి. ఈ ఆజ్ఞను పాలించే సమయములో స్వార్థము స్వప్రయోజనమునకు ఏమాత్రము అవకాశ మివ్వకూడదు. అదియే భక్తికి సరియైన అర్థము. త్రికరణ శుద్ధిగా ఈ కార్యములో మనము ప్రవేశించాలి. ఏదో చెప్పినారని, ఈ డిసిప్లీన్ అంతా నడచుకోవలసి వస్తుందే. నడచుకోపోతే బయట పంపుతారో యేమో అనే భయముతో మాత్రము ఉండకూడదు. ఇది నా జీవితముయొక్క కర్తవ్యము. ఇది నాలక్ష్యము అని భావించాలి. బలవంతముగా మీరు ఆచరిస్తూ ఇక్కడుండి ప్రయోజనము లేదు. మీకు శాంతి ఉండదు. మాకు సంతోషము ఉండదు. డిసిప్లిన్ సక్రమంగా ఆచరించే పద్ధతి ఉండినప్పుడే హృదయపూర్వకంగా ఆచరించాలి. అంతేగాని భయంతోగాని ఇంకే విధమైన దిగులుతోగాని ఈ డిసిప్లిన్‌లో ప్రవేశించకూడదు. ఆ విధంగా వస్తే నీవు నీకు ద్రోహం చేసుకున్నవాడవే అవుతావు. నిన్ను నీవు మోసం చేసుకున్నవాడవే అవుతావు. నిన్నెవరు మోసంచేయటం లేదు. ఆత్మద్రోహము గావించుకున్నవారౌతారు. ప్రతిఒక్క విషయమునందు ఇది నాయొక్క భవిష్యత్తులోపల పవిత్రమైన మార్గమే అనే సత్యాన్ని గుర్తించుకోవాలి. భక్తి భక్తి అనుకోవటం. అన్యులమాటలలో ప్రవేశించటం. ఈనాడు లోకము ఎట్లుందంటే పవిత్రమైన విషయాలను యేమాత్రము యోచించడు. అపవిత్రమైన విషయాలకు త్వరగా చెవులిస్తుంటాడు.

**మంచి మాట వినరు మనసిచ్చి చెప్పిన**
**చెడ్డ మాట అట్టె చెవికి చేరు**
**ఇట్టివారు నన్ను ఎరుగంగ నేర్తురా**
**ఎట్టి చదువులున్న యేమిఫలము?**

మంచి మాటలు వినరు. చెడ్డ మాటలైతే ఒక్క క్షణములోపల చెవికి చేర్చుకుంటారు. చెవినుంచి

srisathyasaivachanamrutam

హృదయానికి చేర్చుకుంటారు. హృదయాలనుంచి ఇంక చేతిలోకి వచ్చేస్తుంది. పనిలో ప్రవేశిస్తారు. కనుకనే త్రికరణ శుద్ధి. మనసునందును, వాక్కునందును క్రియయందును ఏకత్వాన్ని మనం నిరూపించాలి. ఎంతకాలమైనప్పటికి నేను భక్తుడను భక్తుడను అనుకొని జీవితమంతా భుక్తి లోపలనే వ్యర్థం చేస్తే ఇంక భక్తుడెప్పుడౌతాడు. ఇవి సమాజాన్ని మోసగించే పదములు. నీకు నీవు మోసగించుకుంటున్నావు. నీకు నీవు ఆనందించటానికి తగిన కృషి చేసుకో. నీ పంచకోశములలో ఉన్న కడపటి ఆనందాన్ని అనుభవించటానికి నీవు ప్రయత్నించు. నీ అంతర్వాణిని నీవు సరియైన మార్గములో ఉంచుకొని ఫాలో చేయి. అదే కాన్షస్‌నెస్. నీ కాన్షన్స్ నువ్వు ఫాలో చెయ్యాలి. నీకు నీవు సమర్థించుకోటానికి ప్రయత్నించటం చేతను, నిన్ను నీవు ద్రోహం చేసుకున్న వాడవౌతావు. నీలో ఉన్న దోషాలను పూర్తి నిర్మూలం గావించటానికి పూనుకోవాలి. నీ దోషాలంతా సమర్థించటానికి ప్రయత్నించకూడదు. వాడే మహాద్రోహి. అలాంటి వానివల్ల దేశం కూడను పాడైపోతుంది. అలాంటి వ్యక్తులే కనుపిస్తున్నారీనాడు. కనుక విద్యార్థులు, భావి భారతోద్ధారకులు, దేశంయొక్క సౌభాగ్యాన్ని ఆశించే వీరులైన లేత హృదయులైన మీయందు ఈ పవిత్రమైన భావములీనాడు అభివృద్ధిగావాలి.

విద్యార్థులారా! భగవత్ప్రేమనుపెంచుకోలేని హృదయము కేవలము మరుభూమి వంటిది. దాంట్లో పవిత్రమైన మొక్కలు మొలవటానికి వీలే ఉండదు. కనుకనే ఆప్రేమ బీజములు నాటుకోండి. సహనప్రసూనములు వికసింపజేయండి. శాంతి ఫలములు సమాజమున కందించండి. మీరుకూడను శాంతి జీవితము గడపండి. అంతేగాని స్వార్థము చేత అనేకమందిని బాధించటానికి కృషి చెయ్యకండి. నీకు నీవు బాధపడవద్దు. ఇతరులను బాధపెట్టవద్దు. ఇదే భక్తులకు సరియైన లక్షణము. భగవశ్చింతను హృదయమునందుంచుకొని ఏపని చేసినప్పటికిని అది ప్రేమమయంగానే మారుతుంది. కనుకనే దైవనామాన్ని నిరంతరం స్మరిస్తూ చింతిస్తూ దృష్టిని దానిపైనే నిలిపి జీవితం సార్థకం గావించుకోండి.

**(తేది. 09-07-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivahini.org